


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఏడు మైళ్ళు

"**స్వాతంత్ర్యం వచ్చి** ఇన్నేళ్ళయ్యాక కూడా ఇంకా ఇలాంటి ఊళ్ళు ఉన్నాయేంటా అని అనుకుంటున్నావా?" చకచకా అడుగులేస్తున్న ముసలాయన అడిగాడు.

ఎగ్జాక్ట్‌గా ఆ మాటలు కాకపోయినా ప్రశాంత్ అదే మనసులో అనుకుంటున్నాడు.

అతనికి తండ్రి మీద కోపంగా ఉంది. ఈ ఊరి అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం ప్రశాంత్‌కి అసలు ఇష్టంలేదు. ముప్పై ఏళ్ళ తర్వాత ఆయన తన బాల్యమిత్రుడ్ని ఓ రైలు ప్రయాణంలో కలిసాడు. 'ఎక్కడో చూసినట్లుందే' అనుకుని అరగంట సంభాషణ తర్వాత ఒకర్నొకరు గుర్తుపట్టి ఆనందించారు.

ఆ ఆనందం తన పాలిట శాపమైందని ప్రశాంత్ అనుకున్నాడు. తన మిత్రుడి కూతుర్ని కోడలు చేసుకోవాల్సిందే అని ఆయన పట్టుపట్టాడు. ఎవర్నీ ప్రేమించకపోయినా ప్రశాంత్‌కి పెళ్ళిమీద కొన్ని కలలు, కోరికలు ఉన్నాయి. సిటీలో పుట్టి పెరిగి చదువుకున్న అమ్మాయి ఇంగ్లీష్ మాట్లాడే అమ్మాయి, ఉద్యోగం చేసే అమ్మాయి కావాలనుకున్నాడు. మొదటిది సహజంగా అందమైన అమ్మాయి కావాలనేదే.

కాని పల్లెటూరులో బిఏ తెలుగు చదువుకున్న అమ్మాయిని చేసుకొనాల్సిందే అని తండ్రి పట్టుపట్టడంతో అతనికి పెళ్ళి మీదే విరక్తి పుట్టింది. 'ఒక్క జీతంతో బతకడం కష్టం నాన్నా ' అని అప్పటికీ ఆయన్ని కన్విన్స్ చేసే ప్రయత్నం చేసాడు కాని ఆయన వినలేదు. పైగా 'పెళ్ళిని కమర్షియల్‌గా చూడకూడదని' గంట ఉపన్యాసం చెప్పాడు.

"అంతా నీ ఇష్టమే అన్నాక ఇంక పెళ్ళిచూపులు ఎందుకు? డైరెక్ట్‌గా పెళ్ళి చేసెయ్. ఒకవేళ చూసి పిల్ల బాలేదన్నా నువ్వు ఒప్పుకోవుగా" నిర్లిప్తంగా చెప్పాడు.

"ఆ పిల్లకి నిన్ను చూడాలని ఉండదా? ఎప్పుడూ నీవైపునించే ఆలోచిస్తావు" ఆయన మరో ఉపన్యాసం చెప్పాడు.

తీరా పెళ్ళిచూపులకి బయలుదేరే సమయానికి ఆయన మెట్లు దిగుతూ పడిపోయాడు. కుడికాలు ప్రాక్చరైంది.

"వాళ్ళు అన్ని ఏర్పాట్లు చేసుకుని ఎదురు చూస్తూంటారు. నువ్వెళ్ళు" ఆయన అంత బాధలోనూ చెప్పాడు.

"నిన్నిలా వదిలేసి ఎలా నాన్నా?"

"అమ్మ ఉందిగా. నువ్వెళ్ళు"

"అమ్మకూడా రాకుండా ఒక్కడినీ వెళ్ళడం..."

"అమెరికా పోయొచ్చినవాడికి క్షీరసాగరం వెళ్ళడానికి భయమా? నీ వేషాలు కట్టిపెట్టి బయలుదేరు. రైలు టైమౌతోంది" ఆయన అరిచాడు.

"మరోసారి వస్తామని వాళ్ళకి ఫోన్ చెయ్ నాన్న" ధైర్యం కూడదీసుకుని చెప్పాడు.

ఆయన మాట్లాడకుండా తీక్షణంగా చూసాడు. ప్రశాత్ మారు మాట్లాడకుండా ఏర్ బేగ్ తీసుకున్నాడు.

రైలు దిగి చుట్టూ చూసాడు. జనసంచారం లేదు. దూరంగా వెళ్ళిపోతున్న రైలుని చూస్తే దిగులేసింది. బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోయినట్లుగా అనిపించింది. తనకోసం ఎవరూ రాలేదు. కనచూపు మేరలో ఊరేదీ కనపడటంలేదు. ఎటువెళ్ళాలి? ఎలా వెళ్ళాలి?

"ఎక్కడికి?"

ఆ ప్రశ్న విని తిరిగి చూసాడు. డెబ్బై పై బడ్డ ముసలాయన. అదే రైలు దిగినట్లున్నాడు. చేతిలో సంచి ఉంది.

"క్షీరసాగరం" చెప్పాడు.

"నాతోరా. నేనూ అక్కడికే" ఆయన చక చకా నడవసాగాడు.

ప్రశాంత్ ఆయన వెనక నడుస్తూ అడిగాడు.

"చుట్టుపక్కల ఊరేదీ కనపడటంలేదు?"

"అవును ఏడుమైళ్ళు నడవాలి"

"ఏడు మైళ్ళా?" ప్రశాంత్ నిర్ఘాంతపోయాడు.

"అవును. బాట బాగుండదు. బండ్లు, రిక్షాలు ఉండవు. నడకే" ఆయన చెప్పాడు.

ఈ విషయం చెప్పని తండ్రి మీద, తండ్రి స్నేహితుడి మీద ప్రశాంత్‌కి అమిత ఆగ్రహం కలిగింది.

సన్నటి మట్టిబాట. అటూ ఇటూ పొలాలు. నారుమడి. నిండానీళ్ళు. కాలు జారితే ఆ బురదలో పడడమే. జాగ్రత్తగా అడుగులో అడుగులేస్తూ నడుస్తున్నాడు. చకచకా వెళ్ళే ముసలాయన ఇతని అవస్థ గమనించి నెమ్మదిగా నడవడం మొదలుపెట్టాడు.

"ఆదివాసులు ఎలా నడుస్తారో? తెలుసా?" ఆయన అడిగాడు.

"తెలీదు"

"ఒకరి వెనక ఒకరు నడుస్తారు. ఇప్పుడు మనమూ అంతే పక్క పక్కన నడవడానికి సరిపోదు. బురదలో పడతాం. భేతాళుడు చెప్పినట్లు మార్గాయాసం తెలీకుండా నీకో కథ చెప్పనా?"

ఆయన అడిగాడు.

"భేతాళుడు ఎవరు?"

"చిన్నప్పుడు చందమామల్లో బేతాళ కథలు చదవలేదా?"

"లేదు. నాకు తెలుగు చదవడం రాదు. బాగా చిన్నప్పుడు టివిలో విక్రమ్ భేతాళ్ చూసాకాని గుర్తులేదు" ప్రశాంత్ చెప్పాడు.

"ఓ" ఆయన నిరాశగా చెప్పాడు.

"కథ చెప్తానన్నారుగా చెప్పండి"

"కథలు వద్దులేకాని జీవితం గురించి మాట్లాడుకుందాం."

"జీవిత్మ గురించా?" ప్రశాంత్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. మన గురించి మా ఊళ్ళో ఎలాంటి ఆఫీసు, డేమ్, ఆసుపత్రి, పోలీస్ స్టేషన్ లాంటివి లేవు. కాబట్టి నువ్వు గవర్నమెంట్ పనిమీద రాలేదు. టీచర్‌లాగా కనపడటంలేదు. చుట్టాలింటికి వస్తున్నావా?" ఆయన ప్రశ్నించాడు.

"మా నాన్న ఫ్రెండింటికి" ప్రశాంత్ పొడిగా చెప్పాడు.

"మరి నాన్న రాలేదే?"

"ఆయన కాలు ఫ్రాక్చరైంది" విసుగ్గా చెప్పాడు.

"సరే. సరే. నీకు నా ప్రశ్నలు చిరాగ్గా ఉన్నట్లున్నాయ్" ఆయన మౌనం వహించాడు.

ఐదు నిమిషాలు నడక తర్వాత ప్రశాంత్ అడిగాడు.

"జీవితం గురించి చెప్తానన్నారు?"

"నీకు విసుగ్గా ఉంటుందేమో"

"లేదు. చెప్పండి"

ఆ వృద్ధుడు ఒక క్షణం ఆగి వెనక్కి తిరిగి ప్రశాంత్‌ని చూసి నవ్వుతూ అడిగాడు.

"నా మానాన నేను చెప్పుకుంటూ పోతాను. మరి నువ్వు వింటున్నావో లేదో నాకెలా తెలుస్తుంది? నిమిష నిమిషానికి వెనక్కి తిరిగి చూడలేనుగా?"

"లేదు లేదు వింటాను. చెప్పండి. మీరన్నారుగా మార్గాయాసం తెలీకుండా అని."

"నీకు మార్గాయాసం అంటే అర్ధం తెలుసా?"

"తెలుసు చెప్పండి"

"నేను దాక్షాయణిని ప్రేమించాను. కాని సుభద్రని పెళ్ళిచేసుకోవాల్సి వచ్చింది." అంత పెద్దాయన ప్రేమించానని చెపితే ప్రశాంత్‌కి నవ్వొచ్చింది.

"నువ్వు నవ్వుతున్నావు కదా? నేను నీ వయసు దాటివచ్చానని గుర్తుంచుకో" ఆయన కూడా నవ్వుతూ చెప్పాడు.

"సారీ. చెప్పండి"

"ఏభై ఏళ్ళ నాటిమాట. ఇప్పటి ధైర్యాలు అప్పుడు లేవు. దాక్షాయణి పెళ్ళికి పందిరి వేయడం లాంటి సహాయాలు కూడా చేసాకాని బడబాగ్నిని గుండెల్లో పెట్టుకున్నట్లుందనుకో. ఆ అగ్ని ఇంకా నన్ను కాలుస్తోంది" ఆయన గుండెలమీద రాసుకుని చెప్పాడు. అనుభూతులకీ, అదే ఫీలింగ్స్‌కి కాల పరిమితి లేదుకదా! ఆ తర్వాత రెండేళ్ళకి దాక్షాయణిని మళ్ళీ చూసాను. పురిటికొచ్చినప్పుడు. మనిషి దర్భపుల్లలాగా అయిపోయింది. పొట్ట ఒక్కటే కనిపిస్తోంది. పూలగుత్తిగా ఉండే దాక్షాయణి అలా మోడువారిన తీగలా ఉండటం చూసి తట్టుకోలేకపోయాను. అదే అడిగాను.

"మీ అత్తారు బాగా ఉన్నవాళ్ళని విన్నాను. ఇలా అయిపోయావేమిటి? తిండిపెట్టడంలేదా?"

"తిండికి కరువులేదు శివా" పేలవంగా నవ్వింది.

నాకు అర్ధం కాలేదు. 'మరి దేనికి కరువు?' అడిగాను.

"ప్రేమకి. మంచి మాటకి అసలు మనిషి అనే గుర్తింపుకి"

నాకు అర్ధం కాలేదు. తనే చెప్పింది.

నన్ను ఒక మనిషిగా చూడరాయన. నన్ను ప్రేమించరు."

"పెళ్ళి చేసుకున్నాక ప్రేమేంటి?" అనాలోచితంగా అడిగాను.

"నువ్వు ఆ తప్పు మాట మాట్లాడద్దు శివా. మనిషికి ప్రేమించేవారు లేకపోతే ఎంత కరువుగా ఉంటుందో తెలుసా? భార్యని ప్రేమించడం ఏమిటి అనుకుంటారు నీలాంటి వాళ్ళు. కొంతమంది ఆడవాళ్ళకి కూడా అది అర్ధంకాదు. కాని నాకు ప్రేమ కావాలి శివా. నన్ను ప్రేమించే భర్త కావాలి. చీకటి రాత్రుళ్ళు యాంత్రికంగా దగ్గరకి తీసుకునేవాళ్ళుకాదు వెలుతురులో నన్నిష్టపడేవారు. మొదట్లో ఆయనకి చెప్పాను. విచిత్రంగా చూసారు. కావాల్సినంత తిను. కావల్సినన్ని నగలు కొనుక్కో అన్నారు.

దాక్షాయణి కంట నీరు కారిపోతోంది.

"కనీసం నువ్వయినా నీ భార్యని ప్రేమించు శివా. మనిషిగా చూడు. బంగారాలకి, ఆస్తులకే ఆడవాళ్ళు 'పరిమితం' అనుకోకు" చెప్పింది. పదిరోజుల తర్వాత కాన్పు కష్టమై దాక్షాయణి పురిట్లోనే పోయింది. పుట్టిన బాబుకూడా వారం తర్వాత పోయాడు" ఆయన ఆగాడు.

"అయ్యో" ప్రశాంత్ అప్రయత్నంగా చెప్పాడు.

"ఆ తర్వాత రెండేళ్ళకి పెళ్ళి చేసుకున్నాను. దాక్షాయణి చెప్పిన పాఠం బాగా గుర్తుండిపోయింది. సుభద్రని మనిషిగా చూసాను. ప్రేమించాను. ఆమెతో కబుర్లు చెప్పాను. ఆమే నాకు సర్వస్వం అని తనకి అర్ధమయ్యేలా చేసాను. నా ప్రవర్తనని అంతా ఎగతాళి చేసేవారు. పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతాడు అనేవారు. నేనవి పట్టించుకోలేదు. నాకు నా జీవితం ముఖ్యం. వాళ్ళ కామెంట్స్ కాదు. ఇన్నేళ్ళలో మేం దెబ్బలాడుకుంది లేదు. ఒకరినొకరు అర్ధం చేసుకుని విలువిచ్చుకుంటే జీవితం హాయిగా ఉంటుంది.

'అమ్మయ్య పెళ్ళాం పుట్టింటికి వెళ్ళింది. హాయిగా ఉండచ్చు ఈ వారం రోజులు' అనుకునే మగాళ్ళ, 'అమ్మయ్య కేంప్ కెళ్ళాడు. ప్రశాంతంగా ఉంటా నాలుగు రోజులు' అనుకునే ఆడవాళ్ళని చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఇదే దాక్షాయణి చెప్పిన ప్రేమలేని తనం" ఆయన ఓ క్షణం ఆగి చెప్పాడు. "నీకు పెళ్ళయితే నీ భార్యకి విలువివ్వు. ప్రేమించు. పెళ్ళి కాకపోతే ఆ అమ్మాయిని మొదటిరోజు నించే ఇష్టపడు. కనీసం పెంపుడు కుక్కని ప్రేమించినట్లన్నా ప్రేమించు. వినడానికి కటువుగా ఉన్నా నాఉద్దేశం అర్ధమైందనుకుంటాను."

"అర్ధమైంది. నాకింకా పెళ్ళికాలేదు" ప్రశాంత్ చెప్పాడు.

ఇద్దరూ కొద్ది క్షణాలు మౌనంగా నడిచారు.

"మీ పేరు శివా?" ప్రశాంత్ అడిగాడు.

"శివోత్తమరావు. అంతా శివా అనే అంటారు. మా సుభద్ర 'శివయ్యా' అంటుంది. నువ్వు పెళ్ళి చేసుకునే అమ్మాయికి ఏ లక్షణాలుండాలి అనుకుంటున్నావు?"

ప్రశాంత్ ఓ క్షణం ఆలోచించి చెప్పాడు.

"కోరికలు వేరు. వాస్తవం వేరు. ఏదొస్తే అది తీసుకుందామనుకుంటున్నా"

"లవ్ ఫెయిల్యూరా?"

"కాదు. నేను ఎవర్నీ ప్రేమించలేదు."

దాదాపు పాతికేళ్ళ క్రితం నేను ఏదో పనిమీద గూడూరు వెళ్ళాను. పనైపోయింది. మా ఊరికి బస్సులేదు. రైలెక్కాలి. స్టేషన్‌కి నడుస్తున్నాను. నాకు కళ్ళు తిరిగినట్లయింది. షుగర్ తగ్గిందనుకున్నాను. స్టేషన్‌లో ఏదైనా కొనుక్కుని తినచ్చనుకుని రిక్షాకోసం చూసాను. లేవు. నెమ్మదిగా నడవసాగాను. ఒక ఇంటి అరుగు మీదముగ్గురమ్మాయిలు కూర్చుని

చీరలకి ఫాల్స్ కుట్టుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడిదాకా రాగానే కిందపడిపోయాను. ఆ ముగ్గురిలోని ఒకమ్మాయి చీరని కిందపడేసి 'అయ్యయ్యో' అని పరిగెత్తుకుంటూ నా దగ్గరకి వచ్చింది. నా పంచె సర్దుతూ 'మంచినీళ్ళు తెమ్మని స్నేహితురాళ్ళకి చెప్పి, నన్ను మెల్లగా లేవదీసి కూర్చోపెట్టింది. 'నేను మెల్లిగా 'చక్కెర' అన్నాను. ఆ అమ్మాయి 'చక్కెర డబ్బా తీసుకురా' అని పెద్దగా అరిచి నేలమీద నాకు ఆసరాగా కూర్చుంది. స్నేహితురాళ్ళు చక్కెర డబ్బా, మంచినీళ్ళగ్లాసులతో వచ్చారు. ఆమె నా నోట్లో గుప్పెడు పంచదార పోసి నీళ్ళు తాగించి, లేపి అరుగుమీద కూర్చోపెట్టింది. ఓ అరగంట సేద తీరాక నేను రైలు స్టేషన్‌కి వెళ్ళలేదు. ఆ అమ్మాయి ఇంట్లోకి వెళ్ళి వాళ్ళ నాన్నకి నన్ను పరిచయం చేసుకుని వాళ్ళమ్మాయిని మా ఇంటి కోడలుగా పంపమని అడిగాను. వాళ్ళు నిర్ఘాంతపోయారు. నేను వాళ్ళ కులగోత్రాలు, ఆస్తిపాస్తులు అడగలేదు. మా వివరాలు మాత్రం చెప్పాను. ఆ సాయంత్రం బండికి ఆయన నాతో మా ఊరు వచ్చి మా అబ్బాయిని, ఇల్లు వాకిళ్ళని చూసాడు. రెండు నెలల్లో పెళ్ళైపోయింది. చక్కెర చేసిన పెళ్ళి" ఆయన నవ్వాడు.

"కేవలం అందుకే? మరి మీ అబ్బాయి మనస్ఫూర్తిగా ఒప్పుకున్నాడా?" ప్రశాంత్ సందిగ్ధంగా అడిగాడు. ఈ నాన్నలంతా ఇంతే అనిపించిందతనికి.

"మా ఇంట్లో అందరి మాటలకి అందరం విలువిస్తామని చెప్పాగా. మా అబ్బాయి 'నీ ఇష్టం నాన్నా అన్నాడంతే. భార్యకి కావాల్సిన ప్రధాన అర్హత గుండె కింద తడి, మానవత్వం. అదే హ్యూమానిటీ అక్కడున్న ముగ్గురమ్మాయిల్లో కేవలం ఈ అమ్మాయి మాత్రమే ఎందుకు స్పందించింది? కరుణ. అది లేకపోతే మనిషికి, రాతిబొమ్మకి తేడాలేదు. అంతకుముందు మా అబ్బాయి ఒక పెళ్ళిచూపులకి వెళ్ళొచ్చి చెప్పాడు.'ఈ అమ్మాయి మనకొద్దు నాన్నా. ఇంటి ముందుకి వచ్చిన బిచ్చగత్తెని చాలా పెద్ద గొంతుతో వెళ్ళకొట్టింది' మావాడూ నాలాంటివాడేనని నాకు ఆనందమేసింది. పెద్ద వయసులోని తల్లితండ్రులని వచ్చే అమ్మాయి ఎలా చూసుకుంటుందో అన్న భయం కుర్రాళ్ళకి ఉంటుందిగా. మరిప్పుడు మమ్మల్ని చూసుకుంటోంది ఆ బంగారు తల్లేకదా? కాబట్టి నువ్వు ఈ గుణాన్ని కూడా పరిగణనలోకి తీసుకో. అందమో, చదువో మాత్రమేకాదు."

ప్రశాంత్ ఎప్పుడూ ఈ కోణంలో ఆలోచించలేదు. నిజమేకదా అనుకున్నాడు.

"తల్లితండ్రులకి కూడా ఈ విషయంలో అభద్రతా భావం వుంటుంది. ఒక్కడే కొడుకైతే మరీ"

తండ్రి స్నేహితుడి కూతుర్నే చేసుకోవలని ఎందుకనుకున్నాడో ప్రశాంత్‌కి అర్థమైది. అవును తనెప్పుడు తనపరంగానే ఆలోచిస్తాడు. ఒక కొత్త వ్యక్తి ఇంట్లోకి వస్తే, ఎన్ని మార్పులుంటాయి అనుకున్నాడు. మంచివి ఆరోగ్యకరమైన మార్పులైతే పర్లేదు. కానీ ఆయనన్నట్లు గుండెకింద తడి లేనివారు వస్తే?

"నీ తప్పులకి ఎగతాళి చేయనివారు, నీ పొరపాట్లని మన్నించేవారు, నీ అభివృద్ధికోరేవారు నీ పేరెంట్స్. వాళ్ళు చెపితే, వెంటనే నో అనకూడదు. ఓ క్షణం ఆలోచించాలి. మా ముసలాళ్ళ తరపున మాట్లాడుతున్నాకదా?" ఆయన నవ్వాడు.

"లేదండి. మంచిమాటలే చెప్పారు. ఈ ఏడుమైళ్ళ దూరాన్ని నేనెప్పుడూ గుర్తుంచుకుంటాను" ప్రశాంత్ వినయంగా చెప్పాడు.

ఊరొచ్చింది. పక్కపక్కనే నడవసాగారు.

"మా ఇల్లొచ్చింది. నువ్వు ఎవరింటికి వెళ్ళాలి?" ఆయన అడిగాడు.

ప్రశాంత్ చెప్పిన పేరు విని చెప్పాడు.

"తిన్నగా వెళ్ళి ఎడం పక్కకి తిరుగు. ఇంటిముందు బంతిపూల మొక్కలు, కారబ్బంతిపూలు ఉంటాయి. నీలం రంగు గేటు."

"రైలొచ్చి ఇంతసేపైంది. నువ్వు రాలేదని కంగారు పడుతున్నా. ఇంతాలస్యం ఏమిటి? ఇంక నువ్వొక్కడివే వెళ్ళొద్దు ఎక్కడికీ" ఓ వృద్ధురాలు ఆయనకి ఎదురొచ్చి చేతిలోని సంచిని అందుకుంది. "అందుకుని అరుగుమీదే నుంచున్నావా? ఈ బాబు నా అంత వేగంగా నడవలేడని మెల్లిగా నడిచా" ఆయన చెప్పాడు.

ప్రశాంత్ వంగి వాళ్ళిద్దరి కాళ్ళకీ దణ్ణం పెట్టి చెప్పాడు.

"నా పేరు ప్రశాంత్ అండీ. అంతా బాగుంటే ఈసారి మీ ఊరు వచ్చినప్పుడు మీ ఇంటికి వస్తాను."

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments